నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం | ఏప్రిల్ 10, 2024 | www.navatelangana.com

తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా సాంబడి ప్రవీణ్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఎన్నికలు హైదరాబాదులో గల నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన తైక్వాండో మాస్టర్ సాంబడి ప్రవీణ్‌ను నిజామాబాద్ జిల్లా ప్రెసిడెంట్ గాను, మాస్టర్ వినోద్ నాయక్‌ను జనరల్ సెక్రెటరీ గా, బాణోత్ వినోద్‌ను ట్రెజరర్ గా ఎన్నుకున్నారు. ఎన్నో సంవత్సరాల తరబడి వీరు, వీరి శిష్యులతో ఎంతోమంది పేద పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న బాల, బాలికలకు సెల్ఫ్ ప్రొటెక్షన్, ఆరోగ్య సూత్రాలను అందిస్తూ ఆరోగ్యభారత్ నిర్మాణంలో అవిరామంగా సేవలందిస్తున్నారు. వీరి సేవలకు ప్రతిఫలంగా మంచి గుర్తింపు లభించిందని విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉగాది వేడుకలు

నవతెలంగాణ-కామారెడ్డి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయాన్నే ఇల్లువాకిల్లు శుభ్రం చేసుకొని తోరణాలకు మామిడాకులు ఏర్పాటు చేసుకున్నారు. షడ్రుచుల పచ్చడి, పోలెలు చేసుకొని ఆరగించారు. ఆలయాలు, కాలనీల్లో పంచాంగ శ్రవణాలు వినిపించారు. పలు గ్రామాల్లో ఎడ్లబండ్ల ప్రదర్శన, కుస్తీ పోటీలు నిర్వహించారు. పార్టీ అమలు చేస్తున్న పథకాలను ఫ్లెక్సీ రూపంలో ప్రింట్ చేసి ఊరేగించారు.


ఉగాది వేడుకల్లో పలువురు


నీళ్లు లేక ఖాళీగా ఉన్న సాసర్‌పిట్

నీళ్లకు నిధుల్లేవ్

- అడవిలో దప్పికతో అలమటిస్తున్న మూగజీవాలు
- దాహార్తి తీర్చుకునేందుకు గ్రామాలకు
- నిధులు లేక నీటిసౌకర్యం కల్పించలేకపోతున్న ఫారెస్ట్ అధికారులు
- మృత్యువాత పడుతున్న అటవీ జంతువులు

నవతెలంగాణ-రామారెడ్డి

అసలే ఎండలు దంచికొడుతున్నాయి. గతేడాది కంటే రెండు డిగ్రీలు అధికంగా నమోదు అవుతుండటంతో ఏప్రిల్ నెల మొదట్లోనే తీవ్రత 43 డిగ్రీలకు చేరింది. ఎండకు మనుషులే దప్పికతో పాటు వేడికి అతలాకుతలం అవుతుంటే.. అటవీ ప్రాంతంలో ఉన్న జంతువుల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అటవీ ప్రాంతంలో ఉన్న జంతువులు దప్పికతో అలమటిస్తున్నాయి. నీటి జాడలు కనిపించకపోవడంతో మూగజీవాల వేదన అరణ్య రోదన అవుతుంది. సాసర్‌ఫీట్లు, కుంటలు తవ్వించినా వాటిల్లో నీటి జాడ కనిపించడం లేదు. దీంతో నీటి కోసం వెతుకుతూ పలు జంతువులు గ్రామాల్లో వస్తుండగా.. మరికొన్ని మృత్యువాత పడుతున్నాయి. నిధులు లేక అటవీ ప్రాంతంలో నీటి సౌకర్యం కల్పించడం లేదని సమాచారం.

అడవులు, అడవుల్లో ఉండే జంతువులు సమాజ శ్రేయస్సుకు ఎంతో అవసరం. అలాంటి అడవులను, జంతువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలతోపాటు, ప్రజలపై ఉంది. భారత ప్రభుత్వం అడవులు, జంతువుల రక్షణ కోసం అనేక చట్టాలను చేసినా పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో జంతువులు, అడవులు



నశించిపోతున్నాయని చెప్పవచ్చు. ముఖ్యంగా వేసవి కాలం వచ్చిందంటే అడవుల్లో ఉండే జంతువులకు దాహార్తి తీర్చేందుకు నీరు ఎంతో ముఖ్యం. నీరు అందక అనేక అడవి జంతువులు చనిపోవడం, పంట పొలాల, గ్రామాలపై వచ్చి ప్రజలకు హాని కలిగించడం వంటి సంఘటనలు ఎన్నో చోటు చేసుకున్నాయి. అయినా ప్రభుత్వాలు వేసవికాలంలో అడవి జీవులకు నీరు అందించడంలో విఫలమైతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా జంతువులకు నీరందించడానికి ప్రభుత్వం కామారెడ్డి డివిజన్లో 267 సాసర్ ఫీట్స్, బాన్సువాడ డివిజన్లో 94 సాసర్ ఫీట్లు నిర్మించారు. నాలుగు సోలార్ బోర్లను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ఎలుగుబంటిలు 75, చిరుత పులులు 45, అడవి పిల్లులు 13, అడవి కుక్కలు 70, నక్కలు 50, ముంగిసలు 49, మచ్చల జింకలు 1050, మనుబోతులు 750, జింకలు 350, చౌసింగా నాలుగు కొమ్ముల జింకలు 535, కృష్ణ జింకలు 65, కుందేలు 120, పందికొక్కులు 85, అడవి పందులు 2500 ఉన్నట్లు అడవి శాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

నీటిజాడకు వచ్చి మృత్యువాత

వేసవిలో నీటి సౌకర్యం లేకపోవడతో నీటి జాడ వెతుకుంటూ మూగజీవాలు గ్రామాల బాట పడుతున్నాయి. ఈ క్రమంలో ప్రమాదాల బారిన పడి, గ్రామస్తుల దాడిలో పలు జంతువులు మృత్యువాత పడుతున్నాయి. నీటి కోసం గతంలో సదాశివనగర్ మండలంలో జాతీయ రహదారిపై చిరుతలు రావడంతో వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాయి. గత నెల రోజుల క్రితం రామారెడ్డి మండలం రెడ్డిపేట్‌లో ఎలుగుబంటి అనుమానస్పదంగా మృతి చెందిన అవశేషాలను ఫారెస్ట్ అధికారులు సేకరించారు. లింగంపేట్ మండలంలో బోనాల గ్రామపంచాయతీ పరిధిలోని చింతల గుట్ట తండాలో తాజాగా ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఎలుగుబంటి జనావాసాల్లోకి రావడంతో ప్రజలు భయంభ్రాంతులకు గురైయ్యారు.

ప్రభుత్వాలు మారినా.. అదే తీరు

ప్రభుత్వాలు మారినా.. అటవీ జంతువుల సంరక్షణ, సంక్షేమంపై తీరు మారడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జంతువుల, వన్యప్రాణుల రక్షణ కోసం 1972 చట్టం, జంతువులపై క్రూరత్వం నిరోధక చట్టం 1960 కేంద్ర ప్రభుత్వం చట్టాలను చేసినా రక్షణ కరువవుతుంది. గత సంవత్సరం నీరు అందించడానికి నిధులు రాకపోవడంతో, క్షేత్రస్థాయి ఫారెస్ట్ సిబ్బంది గ్రామపంచాయతీ, స్వచ్ఛంద సంస్థ, దాతల సహకారంతో అక్కడక్కడ నీరు అందించారు. తర్వాత నిధులు మంజూరైనా క్షేత్రస్థాయిలో చేరలేదని, ఉన్నతాధికారులే కాజేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సంవత్సరం కూడా నీటికి నిధులు లేవని, స్వచ్ఛంద సంస్థలను, గ్రామపంచాయతీ లతోపాటు దాతల సహకారంతో నీరందించాలని ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించడం గమనార్హం. గ్రామాల్లోనే తాగునీటికి ఇబ్బంది ఉండటంతో, గ్రామపంచాయతీలు కూడా నీరు అందించ లేకపోతున్నాయి. సోసర్ ఫీట్స్ లో నీరు లేకపోవడం అడవి జంతువులు అల్లాడుతున్నాయి.

ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మూగజీవాలకు నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని, అప్పటి వరకు స్థానికంగా ఉన్న వనరులతో నీటి సౌకర్యం కల్పించి మూగజీవాల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అడవి జంతువుల కోసం నిధులు మంజూరు చేసి, నీటిని, ఆహారాన్ని అందించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ పిలుపు



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గత పది సంవత్సరాలుగా బిజెపి అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించారు. ఆ పార్టీ అవలంభించిన విధానాలను తిప్పి కొట్టడానికి పార్టీ కార్యకర్తలు శ్రేణులు కృషి చేయాలని పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు.

అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపి తన ఆధిపత్యాన్ని కొనసాగించటానికి స్వతంత్ర సంస్థలైన సిబిఐ,ఈడి, ఇన్కమ్ టాక్స్ తదితర సంస్థలను తన జేబు సంస్థలుగా మార్చుకొని ప్రత్యర్థి పార్టీల నాయకులను ఇబ్బందులు పెట్టడానికి దాడులు చేస్తూ అరెస్టులను చేసి లొంగ తీసుకోవటానికి ప్రయత్నిస్తున్నారని ఎద్దేవ చేశారు. అదేవిధంగా తన మాటను వినని వారిని జైల్లల్లో నిర్బంధించి అవినీతిపరులుగా చిత్రీకరిస్తూ బిజెపి నాయకులు మాత్రమే సచ్చిలురనే ఒక దుష్ప్రచారాన్ని చేస్తున్నారని విమర్శించారు.

దేశంలో నూటికి 90 శాతం గా ఉన్న ప్రజలకు గత పది సంవత్సరాలుగా లబ్ది చేకూర్చని నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వం... కార్పొరేట్ కంపెనీలకు మాత్రం లక్షలాది కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసి పెట్టడం ద్వారా ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వారి నుండి డబ్బులను వసూలు చేసుకుని ఎన్నికల్లో లబ్ది పొందుతున్నారని ఆయన విమర్శించారు. ప్రజల్లో విద్వేషాలను పెంచి తిరిగి మూడోసారి అధికారంలోకి రావడానికి మత ఉద్రిక్తతలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపిని ఓడించి ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవటానికి ప్రజలందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి వెంకటేష్, నూర్జహాన్, శంకర్ గౌడ్, గంగాధర్, శాల గంగాధర్ ఇతరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నుంచి సిద్దాల నాగరాజు బహిష్కరణ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

క్రమ శిక్షణను ఉల్లంఘించిన సిద్ధల నాగరాజును ఎస్ఎఫ్ఐ నుండి బహిష్కరణ చేసినట్లు జిల్లా అధ్యక్ష కార్యద ర్శులు మహేష్, విగ్నేష్ తెలిపారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేష్, రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆర్మూ ర్ డివిజన్ కార్యదర్శిగా పనిచేసిన సిద్ధల నాగరాజు ఎస్ఎఫ్ఐ సంఘం నిబంధనలను అతిక్రమించడం వలన ఎస్ఎఫ్ఐ ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఎస్ఎఫ్ఐ నుండి బహిష్కరించినట్టు తెలిపారు. నాగరాజకు ఎస్ఎఫ్ఐకు ఇకపై ఎలాంటి సంబంధం లేదని ప్రెస్‌మీట్ ముఖంగా విద్యార్థులకు ప్రైవేట్ ప్రభుత్వ యాజమాన్యాలకు తెలియజేస్తున్నట్టు చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడు పోరాటం నిర్వహించడంలో ముందుం టుందని అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపికా, జిల్లా సహాయ కార్యదర్శి ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

చెత్త డంపు.. కంపు

- మినీ డంపింగ్ యార్డుగా మారిన న్యాల్‌కల్ రోడ్డు
- కుక్కల, పశువుల కళేబరాలు సైతం అక్కడే
- మేయర్ క్యాంప్ ఆఫీస్‌కు కూతవేటు దూరంలో ఎక్కడిచెత్త అక్కడే


రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్త


కుక్క కళేబరం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నగరంలోని న్యాల్‌కల్ వెళ్లే దారిలో రోడ్డు పక్కన చెత్త వేస్తుండటంతో మినీ డంపింగ్ యార్డును తల పిస్తుంది. ఆర్టీసీ 2వడిపో దాటిన తర్వాత రోడ్డు పక్కన చెత్తా_చెదారంతో పాటు కొబ్బరిబోండాలు పడేస్తున్నారు. దీంతో పాటు మృత్యువాత పడిన కుక్కలు, దుడ్డెల కళేబరాలను సైతం అక్కడే వేస్తుండటంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో స్థానికులు, రోడ్డు వెంట వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేయర్ క్యాంప్ ఆఫీస్‌కు కూత వేటు దూరంలోనే చెత్త పేరుకుపోవడం గమనార్హం.

ఎండ.. వాన

రైతుల్లో ఆందోళన


తూకం వేసేందుకు సిద్ధంగా ఉన్న బస్తాలు

- తూకంలో జాప్యం
- కల్లాల వద్ద పేరుకుపోతున్న ధాన్యం
- వాతావరణ మార్పులతో కలవరపడుతున్న అన్నదాతలు

నవతెలంగాణ-లింగంపేట్

పొద్దంతా ఎండ కాస్తూ.. సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణం చల్లబడుతూ వర్షం కురుస్తుండటంతో రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. ధాన్యం కొనుగోలు నెమ్మదిగా సాగుతుండటంతో కల్లాల వద్ద ధాన్యం పేరుకుపోతుంది. దీంతో వాతావరణ మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడి కుప్పలు అక్కడే ఉండటంతో వడగండ్ల వర్షం కురిస్తే.. తీవ్రంగా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తూకం వేగవంతం చేసి ఎప్పటికప్పుడు కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

యాసంగిలో వరి కోతలు ముమ్మురంగా కొనసాగుతున్నాయి. అందుకు తగ్గట్టు కొనుగోలు జరగకపోవడంతో కల్లాల వద్ద రోడ్డు కిరువైపులా ధాన్యం కుప్పలు నిలిచిపోతున్నాయి. తూకంలో జాప్యం చేయడం వల్ల కల్లాల వద్దనే ధాన్యం రాశులు పేరుకు పోతున్నాయి. ఒక వైపు పొద్దంతా ఎండలు తీవ్రం కావడంతో భానుడి భగభగకు రైతులు ఇబ్బందులు పడుతుండగా.. సాయంత్రం వేళ మబ్బులు కాస్తుండటంతో ఎక్కడ వర్షం కురుస్తుందో అని ఆందోళన పడుతున్నారు.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా యాసంగి సీజన్లో 2.44 లక్షల ఎకరాల్లో వరి పంట బోరు బావుల వద్ద చెరువు ఆయకట్టు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో రైతులు సాగు చేశారు. దీంతో జిల్లా యంత్రాంగం రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో నాలుగు లక్షల నలభై ఏడు వేల మెట్రిక టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా జిల్లా వ్యవసాయ పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు.

నామమాత్రంగా కొనుగోలు



ఇప్పటివరకు జిల్లాలో నామాత్రంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్లగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. మరి కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించినా తూకంలో జాప్యంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పేరుకు పోతున్నాయి. మరోవైపు రోడ్డుకు ఇరువైపులా ధాన్యం కిలోమీటర్ల పొడవునా కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేకపోవడంతో రైతులు రోడ్డుకు ఇరువైపులా ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 347 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్‌ఆదేశించారు. సింగిల్ విండో పరిధిలో 325 ఇందిరా క్రాంతి పథకం 22 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికే జిల్లాలో 200 పైన కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. 4 లక్షల 47 వేల మెట్రి టన్నుల ధాన్యం రైతుల వద్ద నుండి సేకరించాల్సి ఉంది. ఎన్నికల కోడ్ ఉండడంతో అధికారులకు కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించారు. కానీ కొన్ని ప్రాంతంలో ఇప్పటివరకు ప్రారంభించలేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలకు దాన్యం తరలించిన 15రోజులైనా తూకం ప్రారంభించకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పేరుకుపోతున్నాయి ఎటు చూసినా ధాన్యం రోడ్డు ఇరువైపులా ధాన్యం కుప్పలు దర్శనమిస్తున్నాయి.

లింగంపేట్ మండలంలో లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 15 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. దీంతో రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. కొనుగోలు కేంద్రాల్లో దాన్యం రాశులు ఉండడంతో దాన్నే ఆరపెట్టుకోవడానికి స్థలం లేక రోడ్డుకిరువైపులా దాన్యం కిలోమీటర్ల పొడవునా రైతుల ఆరబెడుతున్నారు. 15 కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయకపోవడంతో దాన్యం నిలువలు రాశులు దర్శనమిస్తున్నాయి ఈ విషయమై సంబంధిత సింగిల్ విండో సిబ్బందికి సూచించిన రైతులు మొరపెట్టుకున్న తూకం వేయడంలో జాతకం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లింగంపేట మండల కేంద్రంలో కొనుగోలు ప్రారంభించలేదు. కొన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించిన దాన్యం ఇప్పటివరకు మరోవైపు తూకం వేసినప్పటికిని వాటిని సంబంధిత రైస్ మిల్లర్లకు తరలించడంలో సొసైటీ సిబ్బంది పూర్తిగా విఫలమవుతుందని రైతులు మండిపడుతున్నారు.

వసతులు కరువు

కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు కల్పించాలని జిల్లా స్థాయి అధికారులు సంబంధిత సింగల్ విండో అధికారులను ఆదేశించినా క్షేత్రస్థాయిలో మాత్రం పూర్తిగా అమలు కావడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీటి వసతి రైతులకు నిలువ నీడ టెంటు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు టెంట్ ఏర్పడిన దాఖలు లేవు ఎండలు రోజురోజుకు తీవ్రం కావడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద నిలువ నీడ లేక దూర ప్రాంతానికి వెళ్లి చెట్ల కింద సేద తీర్చుకుంటున్నారు. మరోవైపు విద్యుత్ సౌకర్యం నామ మాత్రంగా ఏర్పాటు చేశారు. రాత్రి వేళలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కాపాలం ఉండేందుకు చీకటిగా ఉండటంతో విషపురుగులు సంచరించే అవకాశం ఉందని విద్యుత్ లేకపోవడం వల్ల అంతా చీకటిమంగా మారుతుందని వన్యప్రాణులు వచ్చే అవకాశం ఉందని రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వసతులు కల్పించి తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని రైతుల కోరుతున్నారు.

వడగండ్ల ముప్పు..

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, ఏర్పాటు చేసిన చోట ధాన్యం సేకరణ నెమ్మదిగా సాగుతుండటం పట్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఒక వైపు ఎండవేడికి కుప్పల వద్ద కాపలా ఉండలేకపోతుండగా.. సాయంత్రం వేళ మబ్బులు పట్టి ఉంటూ జల్లులు కురుస్తుండటంతో చేతికొచ్చిన ధాన్యం ఎక్కడ నష్టపోతామో అని ఆవేదన చెందుతున్నారు. సోమవారం రాత్రి వేళ.. గాంధారి మండలంలో సుమారు 40 నిమిషాల పాటు వడగండ్ల వర్షం కురిసింది. వర్షాలున్నట్టు వాతావరణ శాఖ పేర్కొనడంతో రైతులు వాపోతున్నారు. కొనుగోళ్ల వేగవంతం చేయాలని కోరుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి కోతలు పూర్తయిన ధాన్యం సకాలంలో కొనుగోలు జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

తాగడానికి నీళ్లు లేవు

రాజారాం. లింగంపేట్



కొనుగోలు కేంద్రం వద్ద తాగడానికి నీళ్లు లేవు. అయినా గానీ అధికారులు, సిబ్బంది ఇప్పటివరకు మంచినీళ్ల ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళలో కరెంటు లేదు. పండుకోవాలంటే భయమైతుంది. ఇప్పటివరకు కాంట ప్రారంభించలేదు. ఒక వైపు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఏమీ కల్పించడం లేదు.

ఎండకు, వానకు భయమైతుంది

మనోహర్. భవానిపేట్



ఎండకు, వానకు భయమైతాంది. పొద్దంతా ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండ వేడికి కల్లాల వద్ద కాపలా ఉండలేకపో తున్నాం. నీడ లేకపోవడంతో దూర ప్రాంతం చెట్ల కింద కూసుంటున్నాం. పొద్దంత ఎండతో బాధ ఉంటే.. సాయంత్రం వేళ ఆకాశం మబ్బు పట్టి చినుకులు పడుతుండటంతో ఎక్కడ వర్షం కురుస్తుందోమోనని ఆందోళన చెందుతున్నాం. వెంటనే కొనుగోలు కేంద్రంలో తూకం ప్రారంభించాలి. ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలి.

వడగండ్ల బీభత్సం..

- ఈదురుగాలుత వానతో పంటలకు తీవ్ర నష్టం



నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలో మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో తీవ్రమైన గాలి వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. మండలంలో సుమారు గంటన్నర పాటు ఉరుములు మెరుపులతో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న వరి తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

పంట చేతికి వస్తున్న తరుణంలో వడగండ్ల వర్షంతో పంటలపై ఆశలు కోల్పోయామని ఆవేదన చెందుతున్నారు. అధికారులు ప్రభుత్వం స్పందించి తక్షణమే పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. నాగులూర్ గ్రామంలో తీవ్రమైన గాళ్లు వేయడంతో రెండు ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి.


నేలకొరిగిన మొక్కజొన్న

సేవాభావాన్ని పెంపొందించుకోవాలి



అన్నదానం నిర్వహిస్తున్న పిఎన్ఆర్ బ్లడ్ ఫౌండర్స్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి తపస్వితేజో నిలయంలోని చిన్నారులకు మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దాత పిఎన్ఆర్ బ్లడ్ ఫౌండర్ నేరెళ్ల విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందుకు రావాలన్నారు. యువత సేవ భావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు నేరెళ్ల పద్మ, నరసయ్య, వినయ్ చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ గుడి ప్రారంభం



ఎల్లమ్మ గుడి ప్రారంభోత్సవంలో పాల్గొన్న విడిసి సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామ విడిసి ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది శుభ పండుగ రోజు అయిన కొండాపురం ఎల్లమ్మ గుడి నూతనంగా నిర్మించి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బండమీది జమున గంగాధర్, ఎంపీటీసీ యల్ల రాజ్ కుమార్, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, వీడీసీ అధ్యక్షులు లింగారెడ్డి, సుభాష్, మహేందర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సుఖీభవ ఆస్పత్రిలో బంగారు అభరణం చోరీ

- ఐసీయూలో చికిత్స పొందుతున్న పేషెంట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రయివేటు ఆస్పత్రిలో పేషెంట్ పై నుంచి బంగారు అభరణం చోరీకి గురైంది. ఈ ఘటన నగరంలోని సుఖీభవ ఆస్పత్రిలో చోటుచేసుకోగా.. మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని చంద్రనగర్ కాలనీకి చెందిన లతను చికిత్స నిమిత్తం నగరంలోని ద్వారక నగర్‌లో నూతనంగా నిర్మించినటువంటి సుఖీభవ ఆస్పత్రికి కుటుంబీకులు తీసుకెళ్లారు. పేషెంట్‌ను ఐసీయూలో ఉంచి చికిత్స అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడు చోరీకి గురైంది. ఈ విషయం కుటుంబీకులు ఆస్పత్రి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగా.. ఆసుపత్రి సిబ్బంది యాజమాన్యం ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఆ తర్వాత సిసి ఫుటేజీని పరిశీలించగా.. చోరీకి గురైనట్టు తేలింది. దీంతో బాధితులు ఒకటవ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. సీసీ కెమెరాలో బంగారు ఆభరణం ఎత్తుకెళ్లినట్లు రికార్డు అయిందని పోలీసులు వాటి ఆధారంగా విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆరా తీయగా.. జరిగిన ఘటన వాస్తవమేనని సీసీ కెమెరాల పుటేజీ పోలీసులకు అందజేసినట్టు తెలిపారు. అనారోగ్య పరిస్థితితో పుట్టెడు దు:ఖంలో ఆస్పత్రికి వస్తే.. సిబ్బంది చేతివాటం ప్రదర్శించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



కిషన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కేంద్ర మంత్రి వర్యులు, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డిని హైదరాబాదులో వారి ఇంటి వద్ద మంగళవారం నాడు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కిషన్ రెడ్డికి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్చార్జిగా అనుసరిస్తున్న విధివిధానాలను తెలిపారు. పార్లమెంట్ పరిధిలో ఎంపీ ఎన్నికల కోసం చేయాల్సిన విధానాలను చర్చించారు. పార్టీ పటిష్టత కోసం నిరంతరం కృషి చేయాలని కిషన్ రెడ్డి చెప్పారు అని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలిపారు.

ఆటో చోరీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మారం (బి) గ్రామానికి చెందిన మహమ్మద్ పాష తన ఇంటి ముందు ఉంచిన ఆటోను ఎవరో తీసుకెళ్లారు. ఎస్సై మహేష్ వివరాల ప్రకారం... ధర్మారం గ్రామానికి చెందిన మహమ్మద్ పాష కు చెందిన ఆటో నెంబర్. టీఎస్16 యూసి8855 సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి ముందు పార్క్‌చేసి పడుకున్నాడు. మంగళవారం వెకువ జమున నిద్ర నుండి మేల్కొన్నాడు. ఇంటి ముందుపెట్టిన ఆటో కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

కమ్మర్‌పల్లిలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింసోదరులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జామ మసీద్‌లో మంగళవారం సాయంత్రం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సహకారంతో ముస్లిం మైనార్టీ సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే అందించిన సహకారంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఈ ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ విందులో ఆరగించారు. ఇఫ్తార్ విందుకు హాజరైన బిఆర్ఎస్ నాయకులను జామా మసీదు ముస్లిం మైనార్టీ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మేడారం సుధాకర్, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్, నాయకులు కొత్తపల్లి రఘు, ముస్లిం మైనార్టీ కమిటీ సభ్యులు అహ్మద్ హుస్సేన్, హఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మానాల



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గుండు హనుమాన్ దేవాలయంలో మంగళవారం రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు మోహన్ రెడ్డికి ఆశీర్వచనాలు అందజేశారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉగాది పచ్చడి పంపిణీ కేంద్రాన్ని సందర్శించి పచ్చడి స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మోహన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏలేటి గంగాధర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, పడిగెల ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ సిటీ: ఉగాది పచ్చడి అందజేస్తున్న ఎమ్మెల్యే



నిజామాబాద్ సిటీ :వినాయక్‌నగర్‌లో..



బాల్కొండ: పూజలో పాల్గొన్న ఈరత్రి అనిల్

శ్రీ క్రోధి ఉగాది సంబరాలు

- కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం
- రాశి ఫలితాలను తెలియజేసిన పంచాంగ పఠనాలు
- ఉగాది పచ్చడి వితరణ
- ఎడ్లబండ్ల ప్రదర్శన

నవతెలంగాణ-విలేకరులబృందం

తెలుగు సంవత్సరాది అయిన శ్రీ క్రోధి నామ సంవత్సరాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉగాది సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని గ్రామాలు మొదలుకొని జిల్లాకేంద్రం వరకు కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ పఠనాలు, సంవత్సరపు రాశి ఫలితాలను పండితులు వివరించారు. మంగళవారం రావడంతో ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాలు ఈ రోజు నుంచి ప్రారంభం కావడంతో రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

కంఠేశ్వర్ :

పంచాంగ శ్రవణం, షడ్రుచుల పచ్చడి, పిండివంటలు, భక్తి సంగీత విభావరి, ఆత్మీయ సమ్మేళనం, కవితా గోష్టులతో శ్రీక్రోధి నామ సంవత్సరానికి తెలుగు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పసిడి పంటలు పండాలని రైతులు ప్రజలు కోరుకున్నారు. వ్యాపార వేత్తలు తమ వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆయా దుకాణ సముదాయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. షడ్రుచుల పచ్చడి సేవించారు. నూతన వస్త్రాలతో పిండివంటలతో సందడి నెలకొంది. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

గోల్‌హనుమాన్ ఆలయంలో...

నగరంలోని గోల్ హనుమాన్ దేవాలయములో శ్రీ క్రోధి నామ సంవత్సర యుగాది పర్వదినం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ శుభం జ్యోతిషాలయం నిర్వాహకులు శశికాంత్ జ్యోషి పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి గింజుపల్లి, వేణు, చైర్మన్ నీలగిరి రాజేష్, ధర్మ కర్తలు సూర్యపాల్, కృష్ణారెడ్డి అర్జున్ రాథోడ్, శివానంద్, జ్ఞానేశ్వర్, బుస భారతి, అర్చకులు జయరాజ్ జోషి, గంగారెడ్డి, బుస శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయం ఆధ్వర్యంలో..

తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని పులాంగ్ వద్ద గల తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద వెంకటేశ్వరస్వామికి ప్రముఖ పండితులు సీతారామచంద్ర మూర్తి పూజలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు మాధవరావు, ఇంజనీర్ గంగాధర్, సభ్యులు పాల్గొన్నారు.

బాల్కొండ: మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో మంగళవారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా మార్కండేయ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఖనిజాల అభివృద్ధి సంస్థ చైర్మన్ మాజీప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం సభ్యులు ఈరవత్రి అనిల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు మాజీ ఎంపీపీ మనేటి నాగభూషణం, కిసాన్ నగర్ గ్రామ పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలివేరి లక్ష్మీనారాయణ,ఉపాధ్యక్షులు తమ్మే కపిల్, కార్యదర్శి ఆడేపు రవీందర్ , కోశాధికారి జిందం రాజు పద్మశాలి కులస్థులు పాల్గొన్నారు.

ముప్కాల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని వేంపల్లి, వెంచిర్యాల, నల్లూర్, రెంజర్ల, కొత్తపల్లి, నాగంపేట్ గ్రామాల్లో మంగళవారం ఉగాది నామ సంవత్సర వేడుకలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఇంట ఉగాది పచ్చడి చేసుకున్నారు. మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి తయారు చేసి గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో ప్రజలు మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు పలు ఆలయాలలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. పట్టణంలోని జంబి హనుమాన్, జర్నలిస్టు కాలనీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయం, మామిడిపల్లి హనుమాన్ ఆలయంలో పెర్కిట్ శ్రీ రమ సత్యనారాయణ ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. కుక్కల గుట్టలో జరిగిన జాతర కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లోగల విశాఖ కాలనీ నందు శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో బాల్యపల్లి సుబ్బారావు గురుస్వామి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఉగాది పచ్చడి భక్తులకు పంపిణీ చేశారు.

మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో గల మల్లన్న, వేణుగోపాల స్వామి, రామాలయం తదితర ఆలయాల చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బండమీది జమున గంగాధర్, ఎంపీటీసీ యల్ల రాజ్ కుమార్, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, విడిసి అధ్యక్షులు లింగారెడ్డి, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేల్పూర్ మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో ఉగాది వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పోచమ్మ గుడి, హనుమాన్ దేవాలయం చుట్టూ ట్రాక్టర్లతో ప్రదక్షణ చేశారు. అనంతరం ప్రజలుఉగాది పచ్చడి సేవించి ఒకరినొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తాజా మాజీ సర్పంచ్ సౌడ ప్రేమలత, ఉప సర్పంచ్ రమేష్, ఎంపిటిసి చందన్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలోని శివ మార్కండేయ ఆలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉగాది పండుగను జరిపారు. ఆలయఅర్చకులు రాకేష్ శర్మ శివ లింగానికి పంచామృతాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడి వితరణ చేసి పంచాంగ శ్రవణం నిర్వహించారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఉగాది సందర్భంగా హనుమాన్ స్వాములు శోభయాత్ర బ్రాహ్మణపల్లి గాంధీనగర్ మీదుగా జరిగిందని బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ శేఖర్ తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని, పంటలు బాగా ఉండాలని గ్రామంలో శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో స్వాములు శ్రీపతి శేఖర్, అల్లెం అశోక్, సాయిరాం, గంగారాం, భూషణ్, బాలు, బుజ్జి, మల్లయ్య సుదర్శన్, సాయికుమార్, అంజి, గంగ మోహన్ పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ నగరంలోని ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షులు అంతడుపుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బైరి శేఖర్, కోశాధికారి సందీప్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మండే మోహన్, కార్యవర్గం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమానికి వేద పండితులు నరసింహమూర్తి విచ్చేసి పంచాంగ పఠనం చేశారు. అనంతరం జర్నలిస్టులకు షడ్రుచులతో తయారు చేసిన ఉగాది పచ్చడి, బెల్లం పొలెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి విచ్చేసి పంచాంగ పఠనం చేస్తూ ఈ క్రోధి నామ సంవత్సరంలో ప్రకృతికి చెడు చేయాలనుకొనే వారికి మాత్రమే నష్టం కలిగించనున్నదని అన్నారు. ప్రకృతిని కాపాడే వారు, సత్యాన్ని, ధర్మాన్ని కాపాడే వారికి అంత మంచి జరుగుతుందని తెలిపారు. ఈ సారి వర్షాలు సంవృద్ధిగా కురువన్నాయని, పాడి పంటలు బాగానే ఉంటాయని అన్నారు. అనంతరం రాశిఫలాలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఇంగు శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు చట్టం ప్రసాద్, రతన్, గంగారెడ్డి, మధు కర్క రమేష్, శ్రీధర్, హరికృష్ణ, నర్సయ్య, సందీప్, కృష్ణ, మైపాల్, హైమద్, శ్రీకాంత్, బూమేష్, నర్సింగ్, సాయి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: ఉగాది పర్వదినం సందర్భంగా నగరంలో ఉన్న శంభుని ఆలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ చైత్ర శుక్లపక్ష పాడ్యమినాడు మనం ఉగాదిని జరుపుకుంటామని, ఉగాది నుండి కొత్త పంచాంగం మొదలవుతుందని తెలిపారు. ఉగాదికి ప్రతేకం ఉగాది పచ్చడి అని షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేసి సేవిస్తారని, అందులో చేదు, తీపి, వగరు, పులుపు, ఉప్పు, కారం వేప పువ్వు కలిపి తాగుతారని అన్నారు. జీవితం కూడా సుఖసంతోషాలు కలగలిస్తేనే పరిపూర్ణం అవుతుందని, పర్యావరణంలో కూడా నేటితో మార్పులు సంభవిస్తాయని అన్నారు. శ్రీ క్రోధినామ సంవత్సరం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలందరూ అష్ట ఐశ్వర్యాలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రకృతి రైతులకు సహక రించాలని వేడుకున్నారు. ప్రజలందరికి శ్రీ క్రోదినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గాండ్ల లింగం, విశ్వహిందూ పరిషత్ నగర కార్యవహ, దత్రిక రమేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, బీజేపీ నాయకులు, భాస్కర్, హరీష్ రెడ్డి, భూమేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: హిందు వాహిని నగర శాఖ ఆధ్వర్యంలో హిందూ వాహిని కార్యకర్తలు, హైందవ సేన ఉత్సవ సమితి సభ్యులు వినాయక్ నగర్ కాలనీవాసులు నగరంలోని వినాయక నగర్ ప్రాంతంలోని 54 ఫీట్ల హనుమాన్ విగ్రహం వద్ద ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమం నిర్వహించారు.

డిచ్‌పల్లి: డిచ్ పల్లి, ఇందల్ వాయి మండలాల్లోని గ్రామ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో జడ కొప్పులాట ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం నూతన సంవత్సర పంచాంగం విన్నారు.

మెండోర: శ్రీ క్రోధి నామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు సావెల్ గ్రామంలో హనుమాన్ ఆలయంలో నిర్వహించారు. ఆలయంలో మహిళలు, గ్రామ ప్రజలు పూజలు నిర్వహించారు. అనంతరం పంచాంగం పఠనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ.. జీవితం కష్టసుఖాల కలబోత అని తెలియజేయడమే ఉగాది పండుగ ముఖ్య ఉద్దేశమని అన్నారు. దేనినైనా సమానంగా స్వీకరిస్తేనే షడ్రుచులు కలిగిన ఉగాది పచ్చడిలా మధురంగా ఉంటుందని అన్నారు. కార్రమంలో గ్రామ పెద్దలు , మహిళలు , ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనసముందర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు సుధాకర్ శర్మ పంచాంగ శ్రవణాన్ని వినిపించారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బద్దం గంగారెడ్డి, ఉపాధ్యక్షులు రూపాల ధర్మాజీ, క్యాషియర్ కరిపె శేఖర్, కార్యదర్శి మేకల శేఖర్, వైస్ ఎంపీపీ కాలేరు శేఖర్, మాజీ ఉపసర్పంచ్ పెరం లింబాద్రి, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి : శోభాయాత్ర నిర్వహిస్తునన స్వాములు



కమ్మర్‌పల్లిలో..



ఆర్మూర్: పంచాంగ పఠనం వింటున్న గ్రామస్తులు

నాయకులకు అడ్డా.. జాన్కంపేట గడ్డ

నవతెలంగాణ-(వేల్పూరు) ఆర్మూర్

మండలంలోని జానకంపేట ఓ చిన్న పల్లె.. ఆ పల్లెకు చెందిన ఎందరో ప్రభుత్వ కొలువుల్లో రాజకీయ రంగంలో ఎదిగి నాయకత్వాలు వహిస్తూ అంతర్జాతీయంగా రాణిస్తూ గ్రామానికి మంచి గుర్తింపు తెస్తున్నారు. అంతే కాకుండా వ్యవసాయ రంగంలో ఆరుగాలం కష్టపడుతూ గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు గ్రామస్తులు. అన్ని రంగాల్లో ముందుండి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామంలో 15 వందల జనాభా ఉండగా, అందులో కనీసం 10శాతం మందికి పైగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారు.

రాజకీయ,ఉద్యోగ రంగాల్లో...

గ్రామానికి చెందిన కొందరు రాజకీయ రంగంలో రాణిస్తూ ముందుకు సాగుతున్నారు. ఆర్మూర్ నియోజకవర్గంకు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి జాన్కంపేట ముద్దు బిడ్డే. మెదక్ ఉమ్మడి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో బిఎస్పి తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన జంగం గోపి, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పెద్దోళ్ల గంగారెడ్డి ఇదే గ్రామానికి చెందినవారు. ఇదిలా ఉండగా ఉద్యోగ రంగాలలో సైతం అనేకులు తమ సేవలు అందిస్తున్నారు. ఉపాధ్యాయ రంగంలో ఎల్. ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జంగం అశోక్, పిఆర్‌టియు సంఘంలో ప్రధాన బాధ్యునిగా సీరిల్ రాజు, రవి, మహిళ విభాగంలో సూర్యకుమారి, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘంలో సౌడ ఇందిర, పోస్టల్ డిపార్మెంట్ విభాగంలో ఇటీవల రిటైర్డ్ సూపరింటెండెంట్‌గా ప్రతాప్, జాతీయ ఖనిజ అభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన రిటైర్డ్ అయిన ఎస్ జి పద్మారావు ఈ గ్రామ వాసులే. జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లో ఆర్మీలో పనిచేసిన విశ్రాంత స్వామి రావు, కామారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న సిఐ సౌడ సునీల్, యాదాద్రి భువనగిరి జిల్లాలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ తమ శాఖలో న్యాయకత్వం వహిస్తూ రాణిస్తున్న జంగం అశ్విని కుమార్, అబ్కారీ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జంగం వివేక్ ఆయా శాఖలలో నాయకత్వాలు వహిస్తుండడం విశేషం. గ్రామ వాసులు ఎందరో డాక్టర్లు, ఇంజనీర్లు, ప్రొఫెసర్లు, లాయర్లుగా ఎక్కడెక్కడో స్థిరపడడం విశేషం. అంతేకాకుండా వ్యాపారవేత్తలుగా చాలామంది స్థిరపడ్డారు.



నష్టపోయిన పంటలను పరిశీలించిన నాయకులు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని సోంపూర్, టాక్లీ, రామ్‌గంగానగర్, దోమలెడ్గి గ్రామాలలో వడగండ్ల వానకు నష్టపోయిన పంటలను మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఎకరానికి రూ.10వేలు నష్టపరిహారం ప్రభుత్వం నుంచి వచ్చేలా చూస్తానని తెలిపారు.


పంటలను పరిశీలిస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

ముస్లింలకు రంజాన్ సరుకులు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేటలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ముస్లిం కుటుంబాలతో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పచ్చడి మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని ముస్లిం కుటుంబాలకు వచ్చే రంజాన్ పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి కుటుంబానికి పండగ సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ముస్లింలు మాట్లాడుతూ.. గ్రామంలో కులమతాలకు అతీతంగా పండగలు నిర్వహించుకుంటామని, పండగ సరుకులను అందజేసినందుకు శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సరుకులు అందజేత

ఘనంగా ఉగాది వేడుకలు


దోమకొండలో ఎడ్ల బండ్ల ప్రదర్శన..


మద్నూర్ పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

పిట్లం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో క్రోధి నామ తెలుగు సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిల్లిపాది చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ఉదయాన్నే తలంటు స్నానాలు చేసి షడ్రుచుల సమ్మేళనం తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు రుచుల పచ్చడి సేవించి తీపి పిండి వంటకాలతో ఆనందంగా గడిపారు. రైతులు ఉదయాన్నే పశువుల పేడను పంట చేనులలో చల్లి నూతన వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఆయా దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామ చావడీలలో వేద పండితులు ఆధ్వర్యంలో పంచాంగ శ్రావణ పఠనం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, రాజకీయ నాయకులు, యువకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని అత్యధికంగా వ్యవసాయదారులు ఉండే రథం గల్లీలోని శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయంలో మంగళవారం ఉగాది పంచాంగం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు వ్యవసాయదారుల ఆధ్వర్యంలో నూతన పంచాంగాన్ని చదివి వినిపించారు.

బిజెపి కార్యాలయంలో నూతన పంచాంగం..

బిజెపి మండల కార్యాలయంలో పూజ నిర్వహించి నూతన పంచాంగ పఠనం వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంబీ పాటిల్, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే ఎస్.గంగారాం, బిజెపి మండలాధ్యక్షులు తుకారాం తెప్పవార్, రామ్‌పటేల్, పండిత్‌రావు పటేల్, సింగిల్‌విండో డైరెక్టర్ సక్కర్లవార్ బాలకిషన్, నాయకులు కృష్ణపటేల్, సంతోష్, వెంకట్, సంతోష్, సంతోష్ తులవార్, అజయ్ తమ్మేవార్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయాన్ని కాంగ్రెస్ మండల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రోదినామా నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనుమాన్లు, స్వామి, మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, ఆత్మ కమిటీ చైర్మన్ కొండ గంగాధర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షులు వట్నాల వార్ రమేష్ పాల్గొన్నారు.

ఎడ్ల బండ్ల ప్రదర్శన..

దోమకొండ : మండల కేంద్రంలో ఉగాది పండుగ సందర్భంగా ఎడ్ల బండ్ల ప్రదర్శన కార్యక్రమాన్ని ఎస్‌ఐ గణేష్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని స్థానిక చాముండేశ్వర్ ఆలయం, శివరామ్ మందిరం ఆలయంతో పాటు పలు ఆలయాల వద్ద ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించడంతో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తిలకించారు. పోలీస్ బందోబస్త్ మధ్య ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎడ్ల బండ్ల ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్, ఎంపీపీ శారదా, మాజీ సర్పంచ్ అంజలి శ్రీనివాస్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన బీబీ పాటిల్

నవతెలంగాణ-మద్నూర్

10 సంవత్సరాల కాలంగా జహీరాబాద్ పార్లమెంటు స్థానానికి ఎంపీగా కొనసాగుతున్న బీబీ పాటిల్ ఉగాది నూతన సంవత్సరం సందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు.

ముదిరాజ్ జెండావిష్కరణ


జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-గాంధారి

శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామంలో పెద్ద పోతంగల్, తిమ్మాపూర్ గ్రామంలో ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు బట్టు విట్టల్, మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు తూర్పు రాజులు, ముదిరాజ్ మండలాధ్యక్షులు రెడ్డి రాజు, ముదిరాజ్ జిల్లా నాయకులు సంఘని బాలయ్య, ముదిరాజ్ యూత్ మండలాధ్యక్షులు నెల్లి నాగరాజు, కార్యదర్శి రవి, స్థానిక ముదిరాజ్ అధ్యక్షులు, సంఘం సభ్యులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా మత్తడి పోచమ్మ జాతర

- ఎడ్లబండ్ల ఊరేగింపు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు


ఎడ్లబండ్ల ఊరేగింపు..

నవతెలంగాణ-లింగంపేట్

మండల సమీపంలోని పెద్దవాగు సమీపంలో గల ఆదిపరాశక్తి మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలు రంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ జాతరకు ప్రజలు పోటెత్తారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. అలాగే మండలంలోని మంబోజిపేట్ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద ఉగాది పండుగ సందర్భంగా ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. వారం రోజులపాటు మత్తడి పోచమ్మ జాతర ఉత్సవాలు మొదటి రోజు నుంచే ప్రారంభమై వారం రోజులపాటు కొనసాగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా తాగునీటి సౌకర్యం రాత్రి వేళ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినట్టు వివరించారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న అధికారులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలానికి చెందిన 15 సంవత్సరాల మైనర్ అమ్మాయికి బాల్యవివాహం చేస్తున్నారని 1098కి సమాచారం రావడంతో బాల్య వివాహ నిరోధక అధికారులు ఎడపల్లి గ్రామానికి చేరుకొని బాల్యవివాహాన్ని ఆపివేశారు. బాల్యవివాహం చేయడం ద్వారా జరిగే అనర్థాల గురించి అమ్మాయి కుటుంబ సభ్యులకు, గ్రామపెద్దలకు, మైనర్ బాలికకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ఎడపల్లి మండల పర్యవేక్షకురాలు విజయరాణి, ఐసిపిఎస్ అధికారులు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, కార్యదర్శి, ఏఎన్ఎం, అంగన్వాడీ ఉపాధ్యాయులు, ఐకెపి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

180 ఎకరాల్లో వరి పంటకు నష్టం

- నేల రాలిన పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

నవతెలంగాణ-బోధన్

180 ఎకరాలలో వరి పంట రాలిపోయి నష్టం వాటిల్లిందని ఏఈఓ సుజాత తెలిపారు. సాలూరా మండలంలోని హున్సా, మందర్న శివారులో సోమవారం రాత్రి కురిసిన అకాల వడగండ్ల వర్షానికి నేల రాలిన వరి పంటను, మామిడి కాయలను హున్సా క్లస్టర్ ఏఈవో సుజాత రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సోమవారం రాత్రి కురిసిన అకాల వడగండ్ల వానకు మందర్నా గ్రామంలో చేతికి వచ్చిన వరి పంట నేల రాలిందని రైతులు తెలిపారు. అలాగే మందర్న గ్రామ శివారులో 200ల ఎకరాల్లో వరి పంట నేలరాలిందని హున్స సొసైటీ చైర్మెన్ రవి తెలిపారు. అలాగే మామిడి తోటలోని మామిడి కాయలు సైతం నేల రాలిపోయాయని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చూడాలని రైతులు ఏఈఓ సుజాతను కోరారు. అనంతరం మాట్లాడుతూ.. హున్సా క్లస్టర్ పరిధిలో పంట నష్టపోయిన రైతుల వివరాలను ఉన్నత అధికారులకు నివేదిస్తామని ఆమె తెలిపారు. పంటలు పరిశీలించిన వారిలో హున్సా సహకార సంఘ అధ్యక్షులు మందర్నా రవి, గ్రామ రైతు నాయకులు ముప్పాడి లక్ష్మణ్, బాధిత రైతులు తదితరులు ఉన్నారు.


పంటలను పరిశీలిస్తున్న ఏఈఓ

కాంగ్రెస్ ప్రభుత్వానిది అసమర్థ పాలన

- రైతులను ఆదుకోని ప్రభుత్వం
- బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శివసాయి పటేల్

నవతెలంగాణ-బోధన్

గత నెలలో అకాలవర్షం, వడగళ్ళు, ఈదురు గాలులతో వర్షానికి రైతులు పంటలను నష్టపోయారని అయినా ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించకుండా నిర్లక్ష్యం చేస్తుందని, ఇది అసమర్థ ప్రభుత్వమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శివ సాయి పటేల్ అన్నారు. వడగండ్ల వానకు పంట నష్టం వాటిల్లిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు వరి ధాన్యం వందల ఎకరాల్లో నేలకొరగడంతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం పెంటా ఖుర్దు, పెంటాకుర్దు క్యాంప్, సాలంపాడ్ గ్రామాలలో నేలకొరిగిన వరి పంటలను పరిశీలించారు. వ్యవసాయ అధికారులు సత్వరమే పంట పర్యవేక్షణ చేపట్టి రైతులను ఆదుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎలాంటి నిబంధనలు లేకుండా పంట నష్టం వాటిల్లిన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను సమ యానికి ప్రారంభిం చకపోవడం వలనే రైతులకు ఈ దుస్థితి ఏర్పడిందని ఆయన మండిపడ్డారు.

రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పూర్తి బాధ్యత ప్రభుత్వం వహించాలని డిమాండ్ చేశారు. రైతులు అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన ఉంటానని రైతులకు భరోసానిచ్చారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో నిబంధనలు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పెంటాఖుర్ద్ క్యాంపు మాజీ సర్పంచ్ మద్దినేని శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు కొత్తపల్లి నాగయ్య, బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవిగౌడ్, నడిపి మక్కయ్య, రైతులు రాజు, చినుగొండ, సాయిలు, ఎఈవో సాయిచరణ్ తదితరులున్నారు.


పంటను పరిశీలించి మాట్లాడుతున్న నాయకులు

ఆలయ భూములకు కౌలుకోసం వేలంపాట

- ఆదాయం రూ.1,96,000
- రెండు షట్టర్ల ఆదాయం రూ.15,500

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని రథంగల్లీలో గల శ్రీ లక్ష్మీ నారాయణ ఆలయ భూములు ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణలో కౌలు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాట తాత్కాలిక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించగా.. వ్యవసాయదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయానికి చెందిన సాగుభూమి మూడు చోట్ల ఉంది. ఆ మూడు చోట్ల కలిపి ఏడు ఎకరాల 26 గుంటలు ఉండగా వీటికి కౌలు వేలంపాట నిర్వహించారు. మొదట నాలుగు ఎకరాల 14 గుంటలకు వేలంపాట నిర్వహించగా.. దోసవార్ రాజు అనే వ్యక్తి లక్ష పదివేల రూపాయలకు దక్కించుకున్నారు. అదేవిధంగా ఒక ఎకరం 34 గుంటల భూమికి కౌలు వేలంపాట నిర్వహించగా.. ఈ భూమికి బండివార్ హనుమాన్లు అనే వ్యక్తి 54 వేలకు దక్కించుకున్నారు. ఇక ఒక ఎకరం 18 గుంటల భూమికి వేలంపాట వేయగా కొటార్ వార్ సాయిలు అనే వ్యక్తి రూ.32 వేలకు దక్కించుకున్నారు. ఈ విధంగా మూడు చోట్ల గల సాగు భూమికి మొత్తం రూ.1,96,000 కౌలు ఆదాయం వచ్చింది. ఇక ఆలయానికి చెందిన రెండు షెటర్లు వేలంపాట నిర్వహించగా ఆ రెండింటికి కలిసి రూ.15,500 వేలం పాట పాడింది. ఒకటి బండివార్ గంగారం, మరొకటి పడమటివార్ సాయిలు దక్కించుకున్నారు. కౌలు ఆదాయం రెండు షట్టర్ల ఆదాయం కలిపి మొత్తం రూ.2,11,500 లక్ష్మి నారాయణ ఆలయానికి ఆదాయం సమకూరింది. ఈ వేలం పాటను ఆలయ తాత్కాలిక చైర్మన్ చాట్ల గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించగా గ్రామంలోని పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.


వేలం పాటలో పాల్గొన్న పలువురు

అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్‌లకు అవగాహనా సదస్సు


మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని 18 పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్‌లకు ఎంపీడీవో శంకర్, ఎంఈఓ గణేష్‌రావు, కోఆర్డినేటర్ ఆంజనేయులు అవగాహన కల్పించారు. ఎస్ఎంసి కమిటీ చైర్మన్‌కు బదులుగా అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పాఠశాలల మౌలిక సదుపాయాలకు ప్రత్యేక నిధులను కేటాయించనున్నట్లు వారు పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి శంకర్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మండలంలోని 18 పాఠశాలల్లో తాగునీటి సమస్య మరమ్మతులు, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, సంబంధించిన అత్యవసరమైన పనులకు కేటాయించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ గౌస్‌ఉద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పిఆర్టియు మండలాధ్యక్షులు సోమలింగం గౌడ్, పబ్లిక్ పిఆర్ ఏఈ సాయిచంద్, ఏపిఎం చిన్నయ్య, బి.వెంకటలక్ష్మి, రేఖ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు, ఎమ్మార్పీలు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

నవతెలంగాణ-గాంధారి

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సర్దార్ నాయక్ మాట్లాడుతూ.. మన దేశ భవిష్యత్తును రూపొందించడంలో విద్యార్థుల పాత్ర ముఖ్యమని వారు అన్నారు. 1971లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ నేతృత్వంలో ఎన్ఎస్‌యూఐ ఏర్పడిందని ఇందులో పనిచేసిన చాలా మంది నాయకులు జాతీయస్థాయికి ఎదిగారని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని రాహుల్‌గాంధీ దేశప్రధాని చేయటమే ఎన్ఎస్‌యూఐ ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సైనికులుగా పని చేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాకారం, దేవి సింగ్, రాందాస్, గంగారాం, సిత్రం, బాలరాజ్, వినోద్, సంతోష్, ప్రశాంత్, సాయిరాం, రమేష్, రజినీకాంత్, సమేర్, రాజు, శ్రీనివాస్, బిల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బిచ్కుందలో కాంగ్రెస్ నియోజకవర్గస్థాయి సమావేశం

నవతెలంగాణ-బిచ్కుంద

జుక్కల్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని కాంగ్రెస్ కార్యకర్తలతో బిచ్కుంద మండల కేంద్రంలోని బండయప్పా కళ్యాణ మండపంలో మధ్యాహ్నం రెండు గంటలకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు ధర్పల్లి గంగాధర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్, జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు పాల్గొంటారని కార్యకర్తలు, కాంగ్రెస్ శ్రేణులు సరైన సమయానికి వచ్చి సమావేశంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జెండావిష్కరణ


ఉగాది వేడుకల్లో పాల్గొన్న ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం కమిటీ అధ్యక్షులు పున్న లక్ష్మణ్, ముదిరాజ్ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పెద్దమ్మ ఆలయంలో ఉగాది పండగ సందర్భంగా పచ్చడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ సంఘం సభ్యులు ఐకమత్యంతో ఉండి ఉగాది పండుగతో పాటు ప్రతి పండగను కలిసి మెలసి జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ పెద్దమ్మ ఆలయం కమిటీ సభ్యులు బోయిని సత్యం, నర్సింలు బాలయ్య, రాజు, ముదిరాజ్ సంఘం సభ్యులు అబ్రబోయిన రాజేందర్, రమేష్, నాగారపు రాములు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

నవతెలంగాణ-ముప్కాల్

ఉగాది పండుగను పురస్కరించుకుని ముప్కాల్ గ్రామస్థులు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలోని గోదావరి నది జలాలతో గ్రామ దేవతలకు జలాభిషేకం చేపట్టారు. గ్రామంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని, రైతులు వేసిన పంటలు బాగా పండలని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఏటా ఉగాది పండుగను గ్రామంలో ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. గ్రామస్తులకు ఈ సందర్భంగా ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

భూమి అమ్మకం పేరుతో మోసం చేసిన వ్యక్తులపై కేసు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని నాలుగో పోలీస్ స్టేషన్ పరిధిలో భూమి అమ్మిన వ్యక్తులపై మోసం చేసినందుకు కేసును నమోదు చేసినట్లు నాలుగవ పోలీస్ స్టేషన్ ఎస్సై సంజీవ్ మంగళవారం తెలిపారు. ఎస్సై సంజు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మా నగర్‌కు చెందిన అంకం సత్యనారాయణ జూన్ 6, 2023లో గాయత్రి నగర్‌లో సర్వే నంబరు 824లో గల 100 స్క్వేర్ యార్డ్స్ గల ప్లాటును 18 లక్షలకు నాందేవాడకు చెందిన వ్యక్తుల వద్ద నుండి కొనుగోలు చేశారు. అయితే అది తప్పుడు పత్రాలు చూపించి భూమి లేకుండా భూమిని అమ్మిన వ్యక్తులపై మోసం చేసినందుకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంజీవ్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి 44 బీబీపుర్ తండా వద్ద సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా ఒక ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎస్సై మహేష్ వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలంలోని బీబీపుర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని అవుసుల తండాకు చెందిన మాండస్ రాదాబాయి (45) పని నిమిత్తం వచ్చి రోడ్డుపై నుండి తిరిగి స్వగృహానికి వెళ్తుండగ రహదారిపై నుండి వెళుద్విచక్ర వాహనం ఢీకొంది. రాధాబాయికి ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మహేష్ వివరించారు. మృతురాలి కూతురు మాండస్ వళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మార్చురీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఎన్ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-డిచ్‌పల్లి/భీంగల్‌రూరల్

తెలంగాణ యూనివర్సిటీలో నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ సాగర్ నాయక్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూనివర్సిటీ కాంటాక్ట్ అధ్యాపకుల సంఘం అధ్యక్షులు డాక్టర్ వి.దత్త హరి పాల్గొని మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యుఐ విద్యార్థి సంఘం ముందు ఉంటుందని తెలిపారు. విద్యార్థి జీవితంలో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలంటే యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాలను ప్రోత్సహించాలని, నిరంతరం సమగ్ర విశ్వవిద్యాలయ అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. అంతకు ముందు యూనివర్సిటీ ఎన్ఎస్ యుఐ వైస్ ప్రెసిడెంట్ సాగర్ నాయక్ మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ 1971ఏప్రిల్09న నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా అనే విద్యార్థి సంఘాన్ని స్థాపించారని తెలిపారు. ఈ విద్యార్థి సంఘం ముఖ్య ఉద్దేశం సామాజిక న్యాయం, ప్రజాస్వామిక విలువలను పరిరక్షించడం ఈ 54ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో విద్యార్థుల సమస్యల పైన అలుపెరుగని కృషిచేస్తూ అధికారంలో ఉన్నా లేకున్నా సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ చుపిందని వివరించారు. అంతిమ లక్ష్యం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసమేనని, యూనివర్సిటీలోని అనేక విద్యారంగ సమస్యల పరిష్కారనికి కృషి చేసిందన్నారు. ముఖ్యంగా విద్యారంగం మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదం చేయడం, యూనివర్సిటీలోని విద్యా రంగ సమస్యలపైన కృషిచేస్తూ అనునిత్యం ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టిస్తూ యూనివర్సిటీ సమగ్ర అభివృద్ధికి దోహదపడే విధంగా భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కమిటీ నాయకులు మహేష్, రాజేందర్, మంద నవీన్, కుశ కుమార్, శ్రీను రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



భీంగల్‌రూరల్ :బాల్కొండ నియోజకవర్గలొని భీంగల్ మున్సిపాలిటీలో ఎన్ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం జెండా ఆవిష్కరణ చేశారు. ఈసందర్భంగా బాల్కొండ నియోజకవర్గ అధ్యక్షుడు అరుగుల అక్షయ్, నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు రహమాన్ మాట్లాడుతూ..09 ఏప్రిల్ 1971లో విద్యార్థులు కోసం ఎన్ఎస్‌యూఐని ఇందిరా గాంధీ స్థాపించారన్నారు. విద్యార్థులు హక్కులు కోసం ఎన్ఎస్‌యూఐ ఎల్లవేళలా కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండలాల నాయకులు ప్రశాంత్ ,సురేష్ , ఇర్ఫాన్, మనీష్, చిన్న, విగ్నేష్, అభిలాష్, వంశీ, కృష్ణ పాల్గొన్నారు.

లక్ష్మీ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలి



నవతెలంగాణ-ముప్కాల్

ఉత్తర తెలంగాణ వరప్రదాయని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాలువల్లో ఒకటైన లక్ష్మీ కాలువ ద్వారా యాసంగి పంటలకు నీటిని సరఫరా చేయాలని బీజేపీ కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ముస్కు నర్సయ్య అన్నారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి పంటలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని కాలువల్లో ఒకటైన లక్ష్మీ కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు నీటిని విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ చూపి ప్రాజెక్టు అధికారులకు నీటి సరఫరా విషయంలో తగు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్న లక్ష్మీ కాలువకు నీటి విడుదల చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా రైతుల కష్టాలను తీర్చేలా లక్ష్మీ కాలువకు నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనియెడల బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ కిషన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ముస్కు నర్సయ్య, బిజెపి మండల అధ్యక్షులు గడ్డం సంతోష్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ-కిషన్, జక్కుల జీవన్, మ్యాక నర్సయ్య, చిల్క దినేష్, లోక రాములు, శ్రీనివాస్, మజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం గల్ఫ్‌బాట

- ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం
- సొమ్ము చేసుకుంటున్న గల్ఫ్ ఏజెంట్లు

నవతెలంగాణ-భీంగల్

ఉన్న ఊరిని, కన్న తల్లిదండ్రులని, కట్టుకున్న భార్యను, కనిపెంచిన పిల్లలను వదిలి ఉన్న కాస్త కొత్త భూమిని అమ్మి వచ్చిన కొద్దిపాటి డబ్బులకు మరికొంత అప్పుచేసి పుట్టకూటికోసం గల్ఫ్ దేశాలు వెళుతున్న వారికి అక్కడ సరైన ఉపాధి దొరకక వెళ్లేటప్పుడు చేసిన అప్పులు తీరక, కుటుంబాన్ని పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరైతే చేసేదేమీ లేక ఆత్మహత్యలే శరణ్యం అంటున్నారు. అలాంటి కుటుంబాలు ఎన్నో వీధిన పడుతున్నాయి. కానీ ప్రభుత్వాలు మాత్రం వారికి అండగా నిలవలేకపోతున్నాయి. అధికారంలోకి రాకముందు గల్ఫ్ కార్మికులకు హామీలను గుప్పిస్తూ తీరా అధికారంలోకి వచ్చాక విస్మరిస్తున్నాయి. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎంతోమంది పోరాటం చేసిన వారికి అది తీయని కలగానే మిగిలిపోతుంది.



గల్ఫ్ కార్మికులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం...

ఏ ప్రభుత్వాలు వస్తే ఏంటి మా గల్ఫ్ కార్మికుల జీవితాలు మాత్రం మారలేకపోతున్నాయని గల్ఫ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు ఉపాధి కల్పించకపోవడంతో రోజురోజుకు నిరుద్యోగం ఎక్కువైపోతుంది. అధికారంలోకి రాకముందు గల్ఫ్ కార్మికులను ఆదుకుంటామని వారి సంక్షేమానికి కృషి చేస్తామని ప్రగల్భాలు పలుకుతూ అధికారం వచ్చాక పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదైనా కారణం చేత అక్కడ మరణిస్తే శవం తమ కుటుంబ సభ్యులకు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి కూడా ఉంది.

ఉపాధిలేక గల్ఫ్‌కు..

ఉమ్మడి నిజామాబాద్ కరీంనగర్ జిల్లాలకు చెందిన వారు ఎక్కువగా గల్ఫ్ దేశాలకు వెళుతుంటారు. దాదాపు 20 నుండి 25 శాతం మంది గల్ఫ్ దేశాలకు వెళ్తున్నారు. ఇక్కడ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో గల్ఫ్ బాటే శరణ్యం అంటున్నారు. గడిచిన 10 సంవత్సరాల నుండి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుండి 60 వేల మంది గల్ఫ్ లో పనిచేస్తుండగా లక్షా 20వేల మంది వివిధ కారణాలతో స్వదేశానికి తిరిగి వచ్చినట్లు సమాచారం. నిజామాబాద్ జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి అదిలాబాద్ జిల్లాల నుండి అధిక సంఖ్యలో ఉపాధికై గల్ఫ్ బాట పట్టారు.

చదువుకున్న వారు సైతం గల్ఫ్ బాట....

పై చదువులు చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడతారు అనుకున్నా విద్యార్థుల సైతం ఉపాధి కోసం గల్ఫ్ బాట పటపడుతున్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు లేక ఉపాధి దొరకక కనిపెంచిన తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేయకూడదని కొందరు గల్ఫ్ దేశం వెళ్లి అక్కడ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అలాగే చిన్నాచితక కూలి పనులు చేసుకునేవారు రోజు రోజుకు పెరుగుతున్న నిత్యవసర ధరలతో కుటుంబాన్ని నడపలేక ఎడారి దేశం వైపు ఆశలు పెంచుకుంటు అప్పులు చేసి గల్ఫ్ పయనం అవుతున్నారు.

ఎక్కువవుతున్న ఏజెంట్ల మోసాలు...

గ్రామాల్లో ఉపాధి లేక ఉన్న యువకులను గుర్తించి వారికి గల్ఫ్ ఆశ చూపి అలాంటి వారిని నట్టేట ముంచుతు పట్టపగలే ఆకాశంలో చుక్కలు చూపిస్తున్నారు. గల్ఫ్(దుబాయ్, కత్తర్, మస్కట్, ఒమన్) లాంటి దేశాలు వెళ్లేందుకు ఒక్కో వ్యక్తి నుండి లక్షా యాభై నుండి రెండు లక్షల వరకు వసూలు చేస్తున్నారు. కానీ అక్కడి వీసా పని వివరాలను వారికి తెలియజేయక పంపిస్తున్నారు. దీంతో వారు ఒక్కడికి వెళ్లిన తర్వాత నకిలీ వీసాలు, కొందరికి పని లేక, మరికొందరు కంపెనీలలో వెట్టి చాకిరీ చేసినా జీతాలు అందక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు ఆత్రుత చూపుతున్న యువకులను మచ్చిక చేసుకుంటున్న పాస్ పోర్ట్ ఏజెంట్లు వేలు దండుకుంటున్నారు.

1000 కోట్లతో ఎన్నారై పాలసీ తీసుకురావాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం 1000 కోట్లతో ఎన్ఆర్ఐ పాలసీని తీసుకొచ్చి గల్ఫ్ కార్మికులకు, గల్ఫ్ బాధితులకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ పాలసీ ద్వారా చనిపోయిన గల్ఫ్ కార్మికుల కుటుంబానికి ఐదు లక్షల రూపాయలను అందించి భద్రత కల్పించాలి.

ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహనాయుడు



బేస్‌బాల్ వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.మధుసూదన్ రెడ్డి వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులకు 12వేల రూపాయల విలువగల బేస్ బాల్ క్రీడా పరికరాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని విభాగాల రాష్ట్ర టోర్నమెంట్లో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఎక్కువ సంఖ్యలో ప్రాతినిధ్యం వహించేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ప్రోత్సహిస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా బేస్ బాల్ ఉపాధ్యక్షులు మర్కంటి గంగా మోహన్, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, వ్యాయామ ఉపాధ్యాయులు చిప్ప నవీన్, దండు అనిల్, ధర్మపురి, గంగాధర్, జిల్లా కోచ్ లు నరేష్ ,అనిల్ లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ - బాల్కొండ/ భీంగల్ రూరల్

మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలోని ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ నివాసంలో మంగళవారం బడాభీంగల్ గ్రామానికి చెందిన గ్రామ కమిటీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువజన సంఘాల యువకులు దాదాపు వంద మంది నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆరెపల్లి నాగేంద్రబాబు , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొధిరే స్వామి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈరవత్రి అనిల్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈరవత్రి అనిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి భారీగా చేరికలు జరుగుతున్నాయని, రాబోయే ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంటు స్థానం కైవసం చేసుకోవడం కోసం పార్టీ కార్యకర్తలందరూ అందరూ ఒక్కతాటిపై ఉండి కష్టపడాలన్నారు .దేశంలో కూడా రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే, రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని, ఇందిరమ్మ రాజ్యం వస్తుందిని అందరికీ సమానత్వ పరిపాలన అందుతుందని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



తగ్గిన ఎస్సారెస్పీ నీటి మట్టం

నవతెలంగాణ-మెండోర

మండలంలోని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులో ప్రాజక్టు నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. గత సంవత్సరం ఈరోజు నాటికి 22 టియంసిల నీరు నిలకడగా ఉండగా ఈ సంవత్సరం 12 టీఎంసిల నీరు మాత్రమే నిలకడగా ఉంది. నీటిమట్టం తగ్గిపోవడంతో తాగునీటి సరఫరా కోసం ప్రాజెక్టులో నీరు ఉండేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టు అధికారులు సాగునీటి విడుదలను నిలిపివేశారు. యాసంగి పంటలకు చివరి దశలో సాగునీటిని నిలిపివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం నాడు ప్రాజెక్టులో 1059 అడుగులు 12 టిఎంసిల నీరు ఉండగా గత సంవత్సరం ఈనాటికి 1066 అడుగులు 22 టిఎంసిల నీరు ఉంది. గోదావరి నది గుండ ఎగువ ప్రాంతాల నుండి 595 క్యూసెక్కుల నీరు ప్రాజక్టులోకి చేరుతుండగా 314 క్యూసెక్కుల నీరు వృథాగా ఆవిరి అవుతుంది. కాకతీయ కాలువ ద్వారా 40, లక్ష్మి కెనాల్ 5క్యూసెక్కులు, సరస్వతి కెనాల్ ద్వారా 5 క్యూసెక్కుల లీకేజి నీరు వెళుతుండగా మిషన్ భగీరథ ద్వార 231 క్యూసెక్కుల తాగునీటిని ప్రాజెక్టు అధికారులు అందిస్తున్నారు.

హైలెవల్ బ్రిడ్జి పనులపై నాన్చుడు ఎందుకు...?

- ప్రారంభించేది ఎప్పుడు?
- వర్షాకాలంలోపు పనులు పూర్తయ్యేనా?
- టెండర్ పూర్తయిన ముందుకు సాగడం లేదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి శంకుస్థాపనలు చక చక చేశారు. కానీ నెలలు గడుస్తున్న నేటి వరకు పనులు ముందుకు సాగడం లేదు. ఇందల్‌వాయి మండలంలోని వెంగళ్‌పాడ్ (పాటి తండా) వద్ద ఇందల్ వాయి-భీమ్‌గల్ రహదారి మోరగు వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ 2 అక్టోబర్ 2023న 5 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. దానికి కొద్ది రోజుల తర్వాతనే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు ప్రారంభించలేదు. తీరా అదే హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాత పనులను రద్దు చేసింది. మరోసారి నిధులను తానే మంజూరు చేశానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ప్రకటించారు. దానిలో భాగంగానే 19 జనవరి 2024న మరోసారి ఇందల్‌వాయి మండలంలో మోరగు వాగు, లింగాపూర్ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. శంకుస్థాపన చేసి దాదాపు మూడు నెలల కావస్తున్నా ఇప్పటికీ పనులు మొదలు పెట్టలేదు. అనాడు ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అధికారులకు వర్షాకాలం లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దానిలో భాగంగానే మోరగు వాగు టెండర్లు పూర్తయ్యాయి. వర్షాకాలంలోపు హైలెవల్ బ్రిడ్జి పనులు పూర్తి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ప్రకటించారు. దాదాపు టెండర్ ప్రక్రియ కూడా ఈపాటికి పూర్తయిందని, టెండర్ వేసిన కాంట్రాక్టర్ పాత బ్రిడ్జికి అనుకుని కొద్ది దూరంలో నుండి మట్టి రోడ్డు వేసి పైపులు కూడా వేసి నెలలు అవుతున్న నేటి వరకు హై లెవెల్ బ్రిడ్జి పనులు ప్రారంభానికి నోచుకోకపోవడంతో మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా గౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని లింగాపూర్ వాగు వద్ద ఏడు కోట్ల రూపాయల అంచన వ్యయంతో ఒకేరోజు రెండు వేర్వేరు చోట్ల హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపనలు రెండు సార్లు ఆనాడు బాజిరెడ్డి గోవర్ధన్, నేడు డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిలు చేశారు. లింగాపూర్ వాగు వద్దకు ఇంకా ఎలాంటి పురోగతి నేటి వరకు కనిపించడం లేదు. వర్షాకాలంలో ఇందల్‌వాయి నుండి ధర్పల్లి, సిరికొండ, భీంగల్ వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు, ద్విచక్ర వాహనాలు, బస్సులు, లారీలు, టిప్పర్లు, ఆటో, కార్లు, ట్రాక్టర్లకు బ్రిడ్జిపైనుంచి వర్షపు నీరు వెళ్లేటప్పుడు ఎక్కడికక్కడ రోజుల తరబడి వేచి ఉండవలసి వస్తుందని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభిస్తే జూన్ నెల వరకు పూర్తవుతుందని మండల వాసులు అంటున్నారు. ఈ రాహదరి గుండా ఒక్క ఇందల్ వాయి మండలంలోని గ్రామాలే కాకుండా, ధర్పల్లి, సిరికొండ, భీంగల్ మండలాల నుండి రోజు వందలాది వాహనాలు, వేల సంఖ్యలో ప్రజలు అనునిత్యం రాకపోకలు సాగిస్తు ఉంటారు. రెండు హైలెవల్ బ్రిడ్జిలు పాతవి కావడంతో ఎప్పుడూ ఏం ప్రమాదం చోటు చేసుకుంటుందో ననే ఆందోళన నెలకొంది. ఇకనైనా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి రెండు చోట్ల హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టే విధంగా చొరవ చూపాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వాహన దారులు కోరుతున్నారు. రెండు చోట్ల బ్రిడ్జిలు అందుబాటులోకి వస్తే వర్షాకాలం లో ఏ సమయంలోనైనా తాము రాకపోకలు సాగించు కోవచ్చుని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.





ఓం శ్రీ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఉప్లూర్‌లో ఓం శ్రీ మొదటి పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా జిందం గంగాధర్, ఉపాధ్యక్షులుగా ద్యావరశెట్టి తిరుపతి, కార్యదర్శిగా పెంబర్తి నరేష్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా జిందం రమేష్, ద్యావరశెట్టి హన్మాండ్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు అభినందించారు. అంతకుముందు సంఘ భవనంలో పద్మశాలీల కులదైవమైన మార్కండేయ పూజను నిర్వహించి, సభ్యులు ఉగాది పచ్చడిని స్వీకరించారు. 2023-24 సంవత్సరానికి గాను సంఘ జమ ఖర్చులను పరిశీలించారు. కార్యక్రమంలో పద్మశాలి యువజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యెనుగందుల శశిధర్, మండల పద్మశాలి సంఘం సభ్యులు జిందం శ్రీనివాస్, నాగుల ప్రసాద్, అంగరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

5
నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | ఏప్రిల్ 10, 2024 | www.navatelangana.com

నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

- బి.ఆర్.ఎస్ మండలాధ్యక్షుడు బొల్లిపల్లి మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ స్టేజి వద్ద గల అశోక్ గార్డెన్‌లో బి.ఆర్.ఎస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు బి.ఆర్.ఎస్ మండలాధ్యక్షుడు బొల్లిపల్లి మహేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సమావేశాన్ని ఎల్లారెడ్డి తాజా మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి వినోద్‌కుమార్ రానున్నట్టు తెలిపారు. మండలంలోని జడ్పీటీసీ, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్‌లు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నవతెలంగాణ-గాంధారి


ఇంట్లో చిందరవందరగా వస్తువులు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ వివరాల ప్రకారం.. గాంధారి మండల కేంద్రంలో గల సోయక్ పాషా అనే వ్యక్తి గాంధారిలో కొత్త ఇల్లు కట్టుకొని నివసిస్తున్నాడు. నిన్న తన కుటుంబ సభ్యులతో సహా ఇఫ్తార్ విందు ఉన్నందున సాయంత్రం పాత ఇంటికి వెళ్లి రాత్రి అక్కడే ఉండి, ఉదయం తన కొత్త ఇంటికి వచ్చి చూసేసరికి గుర్తు తెలియని వ్యక్తులు అతని ఇంటి తాళం పగులగొట్టారు. బీరువాలో గల అర తులం బంగారు గుండ్లు, వెండి పట్టగొలుసులు, రూ.5వేల నగదు దొంగతనం జరిగినట్టు తెలిపాడు. పాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటి ట్యాంకులు శుభ్రమేనా..?

- మూసుకుపోతున్న మంచినీటి పైపులు
- మూత లేని వాటర్ ట్యాంకులు
- పెచ్చులు ఊడుతూ.. పాకురు పట్టిన ట్యాంకులు


మంచినీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీవో (ఫైల్)

నవతెలంగాణ-భిక్కనూర్

భూమి మీద పుట్టిన ప్రతి జీవికి ప్రతిరోజు తమ దాహాన్ని తీర్చుకోవడానికి మంచినీరు అవసరం. ప్రతి మనిషికి అవసరమయ్యే పంచభూతాలలో మంచినీరు చాలా ముఖ్యమైనది. నీటిని ఎంత పొదుపుగా వాడుకుంటే అంతా ఎక్కువగా లాభాలు ఉంటాయి. ప్రస్తుతం వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటిని పొదుపుగా వాడుకొని ఏ గ్రామంలో కూడా ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ ఎక్కడో ఒకచోట ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. కొన్ని గ్రామాలలో బోరు మోటార్ల సమస్య, వాటర్ పైప్‌లైన్ సమస్యలతో దర్శనమిస్తున్నాయి.

కామారెడ్డి జిల్లాలో 2016 కంటే ముందు 898 మంచి నీటి వాటర్ ట్యాంకులుండగా 2016 తర్వాత నూతనంగా 676 మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను నిర్మించారు. జిల్లా వ్యాప్తంగా మంచినీటి ట్యాంకుల పరిశీలనకు 138 హెల్పర్లు ఉన్నారు. ఈ హెల్పర్లు గ్రామాలలో ఉన్న వాటర్ ట్యాంకుల పరిశుభ్రత ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకులను గ్రామపంచాయతీ సిబ్బంది చేత శుభ్రం చేయించడం, గ్రామాలలో నీటి సమస్యలు ఏర్పడితే అధికారులకు సమాచారం అందజేసి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం వంటి విధులు నిర్వహిస్తారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా వాటర్ ట్యాంకుల పైప్‌లైన్ మూసిపోవడం, ప్రస్తుతం ఉన్న బోర్ల నుంచి నీటి సరఫరా తగ్గిపోవడం, బోరు మోటర్లు లేక నిరుపయోగంగా పైపులైన్ ఉండడం గ్రామాలలో కనిపిస్తున్నాయి.

మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలిస్తూ సమస్య పరిష్కరించాలని అధికారులు ఆదేశిస్తున్నప్పటికీ ప్రస్తుతం ఉన్న వాటర్ ట్యాంకులలో చెత్తాచెదారం, పాకూరు ఉండడం, గడ్డి, మూత లేని ట్యాంకులు దర్శనం ఇస్తున్నాయి. వాటర్ ట్యాంకుల పైప్‌లైన్ మూసిపోవడం కారణంగా మంచినీటి సమస్య గ్రామాలలో అధికమవుతుంది. వాస్తవానికి ప్రతినెల 1,11,21 తేదీలలో గ్రామపంచాయతీ సిబ్బంది చేత మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించడం, శుభ్రం చేసిన తర్వాత బ్లీచింగ్ పౌడర్ చల్లి వాటర్ ట్యాంకుల పూర్తి వివరాలు హెల్పర్లు అందజేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వాటర్ ట్యాంకులను శుభ్రం చేయని కారణంగా చెత్తాచెదారం వాటర్ పైప్‌లైన్‌లలో పేరుకుపోయి ప్రతి ఇంటికి వెళ్లాల్సిన మంచినీటి సరఫరా ఆగిపోతుంది.

జిల్లా వ్యాప్తంగా నిర్మించిన ట్యాంకులలో ఎక్కువ శాతం వాటర్ ట్యాంకులు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకుల కారణంగా వాటర్ ట్యాంకుల లోపలి భాగంలో పెచ్చులూడడం, బ్లీచింగ్ పౌడర్ వేసిన సమయంలో వేడికి కొన్నిచోట్ల వాటర్ ట్యాంకులలో మట్టి పేరుకుపోవడం వంటివి కనిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ఓ గ్రామంలో వాటర్ ట్యాంకులో చెత్తాచెదారం, బట్టలు దర్శనం ఇవ్వడంతో సదరు అధికారి పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే నల్గొండ జిల్లాలో వాటర్ ట్యాంకులు కోతులు మరణించిన విషయం తెలిసిందే.

ఈ విధంగా వాటర్ ట్యాంకులపైన సరైన మూతలు లేని కారణంగా ఉన్నమూతలు తుప్పిపోయి ఊడిపోతున్నందున అధికారులు స్పందించి మంచినీటి వాటర్ ట్యాంకులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ ప్రజలకు మంచినీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్లు కాకూడదు.. ప్రమాదానికి కారణం..

- కార్ల డోర్ లాక్ చేయడంలో యజమానుల నిర్లక్ష్యం
- వేసవి కాలం దృష్ట్యా పార్కింగ్ స్థలంలో జాగ్రత్తలు ఏవీ?

నవతెలంగాణ-బోధన్

నేటి కాలంలో ప్రతి ఇంటికి వారి హోదాను బట్టి కార్లు కొనుగోలు చేస్తున్నారు. దాంతో మధ్యతరగతి కుటుంబాలకు కారు కొనుగోలు, కారు వాడకం అనేది నిత్యవసరమైంది. అంతవరకు బాగానే ఉంది, కానీ కార్ల నిర్వహణలో చిన్నపాటి నిర్లక్ష్యాలు ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నాయి. కారు యజమానులు కారును సంరక్షించుకోవడంలో ఉన్న శ్రద్ధ దాని నిర్వహణలో చూపడం లేదు.

ఫలితంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కార్లు నిలిపినప్పుడు కనీసం డోర్ లాక్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరికొందరు మైనర్లకు వాహనాలు చేతికి ఇవ్వడంతో వారికి డ్రైవింగ్ రాక ప్రమాదాలకు కారణం అవుతున్నారు. మరికొందరు పార్కింగ్ స్థలంలో నుంచి కార్లను బయటకు తీస్తున్న సందర్భంలో కారు కింద నీడ కోసం సేద తీరుతున్న శునకాలు మృతి చెందుతున్నాయి. హైదరాబాద్ లాంటి నగరంలో మైనర్లు కార్లను అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అయినా గాని కార్ల యజమానులలో మార్పు రావడం లేదు. తాజాగా దీనికి బోధన్ ఘటనే ఉదాహరణ.

డోర్‌లాక్‌తో బాలుడి మృతి..

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ గోసంబస్తికి చెందిన 6 సంవత్సరాల కుమారుడు తన తల్లితో గత శుక్రవారం సమీపంలోని హనుమాన్ ఆలయం సమీపంలో కూలీపనికి వెళ్లిన సందర్భంగా బాలుడు ఆడుకుంటూ సమీపంలోని కారులో ఎక్కి డోర్ వేసుకోవడంతో అది లాక్ అయింది. దాంతో కారులో ఊపిరాడక బాలుడు కారులోనే మృతి చెందిన ఘటన జరిగింది. తప్పిపోయాడనుకున్న బాలుడు ఇలా కారులో మృతి చెందడంతో ఆ నిరుపేద కుటుంబానికి తీరని వేదనే మిగిలింది. అలాగే హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ కుమారుడు రాహిల్ గత కొన్ని నెలల క్రితం నిర్లక్ష్యంగా కారు నడుపుతూ ఓ చిన్నారి మృతికి కారణమయ్యాడనే ఆరోపణలు వచ్చాయి. అయినా కారు వినియోగంలో యజమానుల ధోరణి మారడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ వేసవి కాలం దృష్ట్యా మూగ జీవాలు సేదదీరడానికి వాహనాల కింద పడుకుంటాయి. ఆ సమయంలో వాహన యజమానులు వెనుక, ముందు చూసుకోకుండా వాహనాలు తీయడంతో దాని కింద పడుకున్న మూగ జీవాలు ప్రమాదానికి గురై మృతి చెందుతున్నాయి. అలాగే వాహనాలు వెనుకకు తీసే క్రమంలో చిన్నారులు వాహనాల కిందపడి మృతి చెందిన ఘటనలు జరిగాయి. ఇలా ఎన్నో చోట్ల ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. కావున కారుల యజమానులు వారి వాహనాల వినియోగంలో తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రమాదం జరిగిన తరువాత అయ్యో అంటే ఆ కుటుంబాలకు జరిగిన నష్టం ఎవరూ తీర్చలేరు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నవతెలంగాణ-వర్ని

ఆదివారం రాత్రి కురిసిన అకాల వడగండ్ల వర్షానికి బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని, మోస్రా, చందూర్ మండలాలతో పాటు పలు గ్రామాల్లో పంట నష్టపోవడం బాధాకరమని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం వర్ని, చందూర్, మోస్రా మండల పరిధిలోని పలు గ్రామాలలో రైతుల పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వాతావరణంతో భారీ వడగండ్ల వర్షానికి రైతులకు సంబంధించిన వేల ఎకరాల ధాన్యం కోత కోసే సమయంలో నేలపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశానికి అన్నం పెట్టే రైతన్న నష్టపోతే దేశం బతకడమే భారంగా ఉంటుందని, అలాంటి రైతులను ఆదుకోవాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఎలా అయితే వారి నిర్ణయం ప్రకారం ఇవ్వాలనుకుంటుందో ఆ విధంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని ఆయన అన్నారు. ఇది రాజకీయ కోణంగా కాకుండా మానవ దృక్పథంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆ విధంగా రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆయనతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్ణం సాయిరెడ్డి, లక్ష్మంపూర్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ అశోక్ యాదవ్, మాజీ చైర్మన్ మాధవరెడ్డి, సీనియర్ నాయకులు అంబర్ సింగ్, రాజారెడ్డి, రాంరెడ్డి, జైరాం, బట్టు మోహన్, మేడిపల్లి మాజీ సర్పంచ్ రవి, దేవుసింగ్, ప్రచార కార్యదర్శి ముజ్జు తదితరులున్నారు.

పంటలను పరిశీలించిన మండల వ్యవసాయ విస్తరణ అధికారి..

వర్ని ఉమ్మడి మండలంలో చందూర్, మోస్రా, వర్ని మండల కేంద్రాల్లో, పలు గ్రామాల్లో నష్టపోయిన పంటలను మండల వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్‌రెడ్డి పరిశీలించారు. వాటి వివరాలు నమోదు చేసుకున్నారు. వర్ని మండలం జాలాల్‌పూర్, సైద్‌మల్, సిద్దాపూర్, రాజపేట్, శాంకోరా గ్రామాలలో 63 మంది రైతులకు సంబంధించి 105 ఎకరాలు వడ్లు రాలిపోయాయని, అలాగే చందూర్ మండల కేంద్రంతో పాటు చందూర్, ఘన్‌పూర్, లక్ష్మాపూర్, కరేగాం, మేడిపల్లి, లక్ష్మి తండాల గ్రామాలలో 255 మంది రైతులకు సంబంధించిన 405 ఎకరాలు రాలిపోయిందని తెలిపారు. మోస్రా మండలంలో తిమ్మాపూర్, చింతకుంట, గోవూర్ గ్రామాలలో 90 మంది రైతుల 93 ఎకరాలలో రైతులు అకాల వడగండ్ల వర్షానికి వరి పూర్తిగా దెబ్బతిందని రైతుల వివరాలు ఆయన సేకరించారు. ప్రభుత్వం వీరికి నష్ట పరిహారం ఇచ్చేందుకు రైతుల వివరాలు అధికారులకు పంపినట్టు మండల వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్ రెడ్డి తెలిపారు. ఆయనతో పాటు డివిజన్ వ్యవసాయ అధికారులు, రైతులు ఉన్నారు.


పంటలను పరిశీలిస్తున్న పోచారం సురేందర్‌రెడ్డి

బస్తీమే సవాల్..

- నెరల్‌లో ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

నవతెలంగాణ-గాంధారి

బస్తీమే సవాల్ అంటూ మల్లయోధులు తలపడ్డారు. ఉగాది పురస్కరించుకొని గాంధారి మండలంలోని నేరల్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. నేరల్ గ్రామంలో నిర్వహించే కుస్తీ పోటీ లలో పాల్గొనడానికి జిల్లా నలుమూలల నుంచి కాకుండా కర్నాటక, మహారాష్ట్ర నుంచి పలువురు మల్ల యోధులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రూ.100 పోటీ నుంచి మొదలు కొని రూ.1000 బహుమతి వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. చివరగా 3 తులాల వెండి కడెం కుస్తీ నిర్వహించారు. సుమారు 40000 రూపాయల వరకు కుస్తీపోటీలు నిర్వహించారు.

ఒంటిచేత్తో మట్టికరిపించాడు..

నాందేడ్‌కు చెందిన గణేశ్.. ఒంటిచేత్తో పోటీపడి మల్లుయోధులను మట్టికరిపించాడు. వికలాంగుడైనా పోటీపడటంతో అందరినీ ఆకట్టుకుంది. కాగా కుస్తీ పోటీలు తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టి కుస్తీ పోటీలు నిర్వహించారు.


గాంధారి : ఒంటిచేత్తో గెలిపించిన గణేశ్


కుస్తీ పడుతున్న మల్లయోధులు

మండల కేంద్రంలో ఎడ్లబండ్ల ప్రదర్శన..

నాగిరెడ్డిపేట్ : ఉగాది పండుగను పురస్కరించుకొని నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల నల్ల పోచమ్మ ఆలయం చుట్టూ ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామం నుంచి రెండు నుంచి మూడు బండ్ల చొప్పున ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని చుట్టూరా గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి నల్ల పోచమ్మ దర్శనం చేసుకున్నారు.

సదాశివనగర్ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాలను శుద్ధిచేసి మామిడి తోరణాలు, పూలతో అందంగా అలంకరించారు. భక్తులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. షడ్రుచులతో కూడిన పచ్చడిని స్వీకరించారు. గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా బండ్లను ఊరేగించారు. ఆలయ ఆవరణలో అర్చకులు పంచాంగ పఠనం చేశారు. రైతులకు ముహూర్తాలు, ఆదాయ, వ్యయాలు పంటల గురించి చదివి వినిపించారు. ఈ సంవత్సరం అందరి జీవితాల్లో కొత్తదనాన్ని, పునరుత్తేజాన్ని అన్ని అంశాల్లో సంతోషాన్ని తీసుకోరావాలని ఆకాంక్షించారు. ఒకరికొకరు ఉగాది శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

రామారెడ్డి : మండలంలోని ఆయా గ్రామాల్లో తెలుగు నూతన సంవత్సరం, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలు ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. మండలంలోని శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి, శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానాల్లో భక్తుల సందడి అధికంగా కనిపించింది. ఆయా గ్రామాల్లో ఎడ్లబండ్ల ప్రదర్శన కనువిందు చేశాయి.


నాగిరెడ్డిపేట్ : ఎడ్లబండ్ల ప్రదర్శన


రామారెడ్డి మండలంలో..

ఉద్యమకారులకు బీఆర్ఎస్‌లో విలువ లేదు

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఉద్యమంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేసి, అనేక కేసులను ఎదుర్కొని, పార్టీని అధికారంలోకి తెచ్చిన ఉద్యమకారులకు బిఆర్ఎస్ పార్టీలో విలువల లేవని తెలంగాణ ఉద్యమకారుడు నారెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి హైదరాబాదులో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో మంగళవారం బిజెపి కండువా వేసుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... అభివృద్ధిలో భాగంగా బిజెపిలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు.



నీ లెక్కలు మొత్తం బయటకు తీస్తాం


మాట్లాడుతున్న కాంగ్రెస్ మండలాధ్యక్షులు


నవతెలంగాణ-భిక్కనూర్

నీ అవినీతి, కబ్జాలు మొత్తం లెక్కలు బయటకు తీస్తామని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమ్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో ఉండి మాట్లాడితే బాగుంటుందని తెలిపారు. ఎంపీపీ గాల్ రెడ్డి నీ తప్పులు సహించలేకే కాంగ్రెస్ పార్టీలో చేరాడని, రాజీనామా చేయాల్సిన అవసరం ఎంపీపీ గాల్‌రెడ్డికి లేదన్నారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచులను రాజీనామా చేసి పార్టీలో చేర్చుకున్నావా? అని ప్రశ్నించారు. భయభ్రాంతులకు గురిచేసి మానసికంగా ఒత్తిడి తీసుకువచ్చి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన ప్రజాప్రతినిధులను బీఆర్ఎస్ పార్టీలో చేరేవరకు వారిని వదిలి పెట్టలేదని అందుకే వారు నమ్ముకున్న పార్టీలోకి మళ్ళీ తిరిగి వస్తున్నారని తెలిపారు. మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డి గురించి మాట్లాడే ముందు అదుపులో ఉండి మాట్లాడాలని, నీపై ఎదురు తిరిగినందుకు మాత్రమే నాపై తప్పుడు కేసులు పెట్టించారని ఆర్మీలో ఉన్న సమయంలో ఒక్క రిమార్కు కూడా నాపై లేదని గుర్తు చేశారు. ఇకముందు కాంగ్రెస్ పార్టీ నాయకుల జోలికి వస్తే నీ అవినీతి, భూ కబ్జాల వివరాలు బయటపెట్టి నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, సొసైటీ చైర్మన్ కృష్ణగౌడ్, ఎన్నారై సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తును రూపొందించడంలో విద్యార్థులదే కీలకపాత్ర

- ఘనంగా ఎన్ఎస్‌యూఐ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు
- ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి


ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

మన దేశ భవిష్యత్తును రూపొందించండంలో విద్యార్థుల పాత్ర ముఖ్యమని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ కుమార్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ ఫౌండేషన్ డే, ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డెయిరీ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులతో కలిసి మంగళవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నారని తెలిపారు. 1971లో అప్పటి ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ నేతృత్వంలో ఎన్ఎస్‌యూఐ ఏర్పడిందని, తదనంతరం విద్యారంగ సమస్యల పరిష్కారం దిశగా పోరాటం చేసిందన్నారు. ఇందులో పనిచేసిన చాలామంది నాయకులు జాతీయస్థాయికి ఎదిగారని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. విద్యా ఉద్యోగ హక్కులను రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా గుర్తించాలని కోరారు. విద్యార్థుల సంక్షేమం హక్కుల కోసం ఎన్ఎస్‌యూఐ నిరంతరం పోరాడుతుందని రాహుల్ గాంధీ దేశప్రధానిని చేయడమే ఎన్ఎస్‌యూఐ ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సైనికులుగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి భరత్, (టింకు), ఎన్ఎస్‌యూఐ నాయకులు రాహుల్, సోఫియాన్, ఆకాష్, అలీం, ఫణీంద్ర, అభిలాష్, యశ్వంత్, ఆనంద్, సాయినాథ్, రాఖీ, మనోహర్, దినేష్, విష్ణు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మొరంపై రెవెన్యూ కార్యాలయంలో గొడవ..?

- సమాచారం ఇచ్చిన వారు, తవ్వకాలు జరుగుతున్న వారి మధ్య వాగ్వాదం
- అక్రమంగా మొరం తవ్వితే చర్యలు : ఎమ్మార్వో
- మొరం తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తాం : ఎస్సై

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండలంలో మొరం మాఫియా రోజురోజుకూ పెరిగిపోతోంది. దీనిని గమనిస్తున్న స్థానికులు మొరం మాఫియాను అడ్డుకట్ట వేయడానికి రెవెన్యూ అధికారులకు, జిల్లా అధికారులకు సమాచారం అందజేస్తున్నారు.

మొరం అక్రమంగా తరలిస్తున్న సదరు వ్యక్తులు సమాచారం ఇచ్చిన వారి వివరాలు తెలుసుకొని వారిపై గొడవకు దిగుతున్నారు. రెవెన్యూ కార్యాలయం సాక్షిగా సోమవారం అక్రమంగా తరలిస్తున్న మొరం మాఫియా వ్యక్తులు సమాచారం అందించిన వ్యక్తులు తహసీల్దార్ కార్యాలయంలో గొడవలు పెట్టుకున్నట్లు సమాచారం.

మొరం తరలిస్తున్న వ్యక్తి ఎవరికైతే మొరం సరఫరా చేస్తున్నారో వారిని గుంపుగా వేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సమాచారం ఇచ్చిన వ్యక్తిపై దాడికి దిగినట్లు సమాచారం. ఒక్కసారిగా మొరం మాఫియా వ్యక్తులు సమాచారం ఇచ్చిన వ్యక్తులపై దురుసుగా ప్రవర్తించడంతో సమాచారం అందించిన వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. రెవెన్యూ కార్యాలయానికి మొరం మాఫియాపై సమాచారం అందిస్తే సమాచారం అందించిన పేర్లు ఎవరు తెలియజేస్తున్నారని, ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచాల్సిన అధికారులు ఎలా మొరం మాఫియా వ్యక్తులకు తెలుస్తున్నాయని సమాచారం అందించిన వ్యక్తులు ఆరోపణలు చేస్తున్నారు.

వాస్తవానికి పట్టా ల్యాండ్ నుంచి మొరం తరలించిన మైనింగ్ అధికారుల అనుమతి తీసుకొని రెవెన్యూ అధికారులకు అనుమతి పత్రాన్ని అందజేస్తే మొరం తవ్వకాలు జరుపుకోవడానికి అనుమతి ఉంటుంది. అనుమతులు ఏమీ లేకుండా అధికారులను చూసుకుంటే సరిపోతుందన్న చందంగా తమ ఇష్టానుసారంగా మొరం తవ్వకాలు జరుపుకోవాలని మొరం మాఫియా వ్యక్తులు ఇష్టానుసారంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీస్ అధికారులు మొరం మాఫియాపై నిఘా ఏర్పాటు చేసి సంబంధిత ట్రాక్టర్, జెసిబిలను సీజ్ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మొరం తరలిస్తే వాహనాలు సీజ్

అక్రమ మొరం తవ్వకాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదు. రెవెన్యూ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిఘా ఏర్పాటు చేసి వాహనాల పై కేసు నమోదు చేస్తాం.

- ఎస్సై సాయికుమార్

అక్రమ మొరం తరలిస్తే చర్యలు తప్పవు

అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు చేపడితే శాఖపరమైన చర్యలు తప్పవు. అర్ధరాత్రి సమయంలో నిఘా ఏర్పాటు చేసి మొరం తవ్వకాలకు పాల్పడితే ట్రాక్టర్, జెసిబిలను సీజ్ చేస్తాం.

- ఎమ్మార్వో శివప్రసాద్